నేడు రాయచూరుకు మంత్రి దినేశ్ గుండూరావ్

రాయచూరు, సెప్టెంబరు 17: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ బుధవారం రాయచూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు కలబురగి నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి మంత్రి, 10 గంటలకు జిల్లా కేంద్రం చేరుకుంటారు. 10:30 గంటలకు నగరంలోని స్త్రీ, శిశు సంక్షేమ ఆస్పత్రిని పరిశీలించనున్నారు. ఇక్కడి నుంచి బయలుదేరి తాలూకాలోని గుంజళ్లి, గిల్లేసుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి తిరిగి నగరానికి చేరుకుని, సాయంత్రం 6:40 గంటలకు రైలు ద్వారా బెంగళూరుకు తిరుగు ప్రయాణమవుతారని అధికారులు ప్రకటించారు.



అధికారమే.. లక్ష్యం



కలబురగి నగర పంచాయతీ కార్యాలయం



- స్థానిక సంస్థల్లోనూ మూడు పార్టీల 'ఆపరేషన్'
- 20 నగరపాలికల్లో టెన్షన్..టెన్షన్
- అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం పోటాపోటీ
- ఉద్రిక్తంగా మారిన కిడ్నాప్‌లు

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో అధికారం కోసం పార్టీలు తహతహలాడడం, పోటాపోటీగా ఎమ్మెల్యేలకు తాయిలాలు ఆశ చూపడం తెలిసిందే. అయితే ఏడాదికోసారి మారే పురపాలిక, నగరపాలిక సభల్లోనూ అధికారం దక్కించుకోవడం కోసం పోటీ పడడం రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. అధికారం దక్కుతుందంటే పార్టీ సిద్ధాంతాలు, అగ్రనేతల ఆదేశాలు బేఖాతరు... ఎంతటికైనా సై అనే పరిస్థితి నగరపాలికలలో హల్‌చల్ చేస్తోంది. మెజారిటీ అనేది ఓటమి బాటలాగా మారింది. ఎక్కువస్థానాలు దక్కాయని అధికారం మాదే అనే పరిస్థితి లేకుండా పోయింది. పదవుల కోసం... పాలకులు దారితప్పుతున్నారు.

విప్ ఉల్లంఘన, పార్టీ ఫిరాయింపు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, రిసార్ట్ రాజకీయం, కిడ్నాప్‌లు, ఓటింగ్ నుంచి తప్పుకోవడం వంటి చర్యలు పలు రాష్ట్రాల శాసనసభ ల్లో కొనసాగాయి. కానీ రాష్ట్రంలో ఆపరేషన్‌తోనే అధికారం అనేలా పరిస్థితులు మారిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నగరపాలక సంస్థలు, స్థానిక సంస్థల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకోసం ఈ తంతు నిత్యకృత్యంగా మారిపోతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీస్థానాలు దక్కినా బహిరంగంగా సాగుతున్న ఆపరేషన్‌లు అంచనాలను తలకిందు లు చేస్తున్నాయి. సంఖ్యాబలం లేకున్నా, ప్రతిపక్షాల సభ్యులను చేర్చుకుని అధికారం పొందడమే ఇందుకు సాక్ష్యంగా చెప్పవచ్చు. సాధారణంగా మెజారిటీ ఉన్న పార్టీ ఐదేళ్లపాటు స్థానిక సంస్థలలో పాలన కొనసాగించేందుకు వీలుంటుంది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు మార్పులు జరిగినా ఒకే పార్టీ మాత్రమే ఐదేళ్ల అధికారాన్ని కొనసాగించేది. దశాబ్దాలుగా ఇదే విధానం కొనసాగింది. ఇటీవల రాష్ట్రంలో పలు నగర పాలక సంస్థలకు మెజారిటీ విధానానికి తిప్పికొట్టి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. పార్టీ ఫిరాయించి జతకట్టేవారికి భారీ కానుకలు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఇంటి స్థలాలు, ఆస్తులు, నగదు వంటి తాయిలాలు ఇస్తున్నారు. ఇలాంటి తాత్కాలిక బహుమతులకోసం కౌన్సిలర్‌లు, కార్పొరేటర్‌లు ఏమాత్రం ఆలోచన లేకుండా సుదీర్ఘ రాజకీయ చరిత్ర అనే పదానికి అర్థం లేకుండా చేస్తున్నారు. రాష్ట్రంలో 61 నగరసభలు, 125 పురసభలు, 115 పట్టణ పంచాయతీలు ఉన్నాయి. 20 నగరసభ, పురసభ, పట్టణ పంచాయతీలలో 'ఆపరేషన్' విధానంతో అధికారం దక్కింది. కోర్టు ఆదేశాలతో శివమొగ్గ నగరసభ, ఉత్తరకన్నడ జిల్లా ముండగోడు పట్టణపంచాయతీ, కలబురగి జిల్లా జేవర్గి, అఫ్జల్‌పుర పురసభలు, బెళగావికి చెందిన కిత్తూరు పట్టణపంచాయతీలకు ఎన్నికలు వాయిదాపడ్డాయి. కిత్తూరు పట్టణ పంచాయతీ ఎన్నికలను బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎన్నికలకు ముందే బీజేపీ సభ్యుడు నాగరాజ్ అసుండిని కిడ్నాప్ చేశారు. దీనిని ఖండిస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టింది. న్యాయపోరాటంలో భాగంగా ధారవాడ హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఎన్నికకు బ్రేక్ పడింది. కోర్టులో హెబియస్ కార్పస్ రిట్‌ను దాఖలు చేయడంతో పోలీసులు గాలింపు జరిపి ఎట్టకేలకు నాగరాజ్ అసుండిని కోర్టు ముందు హాజరు పరిచారు.

అధికారం కోసం

అధికారం కోసం పలు నగరసభలు, పురసభలు, పట్టణపంచాయతీల సభ్యులను వారి పార్టీలకు చెందినవారిని మాత్రమే కాకుండా ప్రతిపక్ష సభ్యులను సైతం క్యాంప్ రాజకీయాలకు తీసుకెళ్తున్నారు. వారివద్ద ఫోన్లను సైతం అందుబాటులో ఉంచరు. నేరుగా ఎన్నిక రోజున కౌన్సిల్‌హాల్‌కు తీసుకొస్తున్నారు. ఇలాంటి హైజాక్‌లు పలుచోట్ల జరిగాయి. వీటికితోడు స్థానిక సంస్థలలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకునే వెసలుబాటు ఉంటుంది. ఇక్కడ పదవులకంటే సాధించుకోవడమే సవాల్‌గా ఉంటుంది. ఇటీవల కేంద్రమంత్రి కుమారస్వామితోపాటు రాష్ట్రమంత్రులు పలువురు ఓటు వినియోగించుకున్నారు. మండ్య నగరసభను జేడీఎస్ దక్కించుకునేందుకు స్వయంగా కుమారస్వామి వ్యూహాత్మకంగా వ్యవహరించి అధికార కాంగ్రెస్‌కు చెక్ పెట్టారు.

మూడు పార్టీలదీ అదే తీరు..

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు ఆపరేషన్‌తో అధికారం సాధించుకుంటున్నాయి. మండ్య నగరంలో జేడీఎస్‌కు చెందిన ముగ్గురు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినా, కాంగ్రెస్‌కు చెందిన ఓ సభ్యుడిని జేడీఎస్ తమవైపు తిప్పుకోవడంతో మండ్య నగరసభను దక్కించుకున్నాయి. హాసన్ నగరసభలో బీజేపీ సభ్యుడు జేడీఎస్‌లోకి చేరి ఉపాధ్యక్షపదవి పొందారు. అరకలగూడు పట్టణ పంచాయతీలో ఆపరేషన్ ద్వారా అధికారం దక్కించుకుంది. అరసికెరెలో జేడీఎస్‌కు మెజారిటీ ఉన్నా కాంగ్రెస్ సభ్యుడు అధ్యక్షుడయ్యారు.

మెజార్టీ ఉన్నా.. దక్కని అధికారం

దావణగెరె జిల్లా జగళూరు పంచాయతీలో బీజేపీకి మెజారిటీ ఉన్నా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించి బీజేపీ సభ్యులను గైర్హాజరయ్యేలా కుట్ర పన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే జోక్యంతో అధ్యక్ష స్థానం బీజేపీకి, ఉపాధ్యక్ష పదవికి కాంగ్రెస్‌కు దక్కింది. హొన్నాళిలో బీజేపీకి మెజారిటీ ఉన్నా కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. చిక్కమగళూరు నగరసభలో బీజేపీ సభ్యులను కేరళ టూర్‌కు తీసుకెళ్లి కాంగ్రెస్ అధికారం దక్కించుకునే ప్రయత్నం చేసింది. మూడగెరె పంచాయతీలో అధ్యక్షస్థానం దక్కనందుకు జేడీఎస్ అభ్యర్థి కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ మెజారిటీ ఉన్నా బీజేపీకి షాక్ ఇచ్చింది. కొప్పళ నగరసభలో ముగ్గురు బీజేపీ సభ్యులు విప్ ఉల్లంఘించి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో అధికారం దక్కించుకుంది. శివమొగ్గ జిల్లా హొసనగర జోగ్ పట్టణ పంచాయతీ, శిరాళకొప్పలో బీజేపీ అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. జోగ్‌లో బీజేపీ సభ్యులు రిసార్టుకు వెళ్లి వచ్చినా కాంగ్రెస్ సభ్యుడు అధ్యక్షుడయ్యారు. చిత్రదుర్గ నగరసభలో బీజేపీ-జేడీఎస్ కూటమికి షాక్ తగిలింది. ఇండిపెండెంట్‌గా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన సునితా రఘు కాంగ్రెస్‌బలంతో అధ్యక్షస్థానం పొందారు. బీజేపీ-జేడీఎస్ కూటమికి చెందిన శ్రీదేవి ఉపాధ్యక్షురాలయ్యారు. గదగ్ జిల్లా ముండగెరె పురసభలో బీజేపీకి మెజారిటీ ఉన్నా అంతర్గత పోరుతో కాంగ్రెస్ మద్దతుతో రెబెల్ నిర్మలా కోర్లహళ్ళి అధ్యక్షురాలయ్యారు. ఉడుపి జిల్లా కాపు పురసభలో విప్ ఉల్లంఘించి బీజేపీలో చేరి ఎస్‌డీపీఐ సభ్యుడు ఉపాధ్యక్షుడయ్యారు. చామరాజనగర నగరసభలో కాంగ్రెస్ సభ్యులు ముగ్గురు గైర్హాజరు కాగా ఒకరు బీజేపీకి మద్దతు ఇవ్వడంతో అధికారం దక్కింది. గుండ్లుపేట పురసభ, కొళ్ళేగాల నగరసభలలో బీజేపీ సభ్యులు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. కలబురగి జిల్లా జీవర్గి పురసభలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల వాయిదా కోసం బీజేపీ హైకోర్టును ఆశ్రయించడంతో నాలుగుసార్లు వాయిదా పడింది. అఫ్జల్‌పురలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉన్నా అధ్యక్షస్థానానికి సంబంధించి బీసీ బీ మహిళ లేరు. అధ్యక్షస్థానానికి అభ్యర్థి లేకపోవడంతో ఈనెల 20వరకు కోర్టు వాయిదా వేసింది. హావేరి నగరసభలో విప్ జారీ చేసినా కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఓటింగ్‌కు గైర్హాజరు కావడంతో బీజేపీ అభ్యర్థులు శశికళ మాళవి అధ్యక్షురాలిగాను, మల్లికార్జున సాతేనహళ్ళి ఉపాధ్యక్షుడయ్యారు. కాంగ్రెస్ సభ్యులను పూనె రిసార్టుకు పంపినా ఫలించలేదనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ సీఎం, ఎంపీ బసవరాజ్ బొమ్మై ఇక్కడి ఎన్నికలకోసం సుమారు అరకోటికి పైగానే ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిక్కబళ్ళాపుర నగరసభలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉన్నా ఎంపీ డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో ఇండిపెండెంట్ అభ్యర్థి మద్దతుతో బీజేపీకి మెజారిటీ దక్కింది. గౌరిబిదనూరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడకు బీజేపీ, జేడీఎస్ సభ్యులు మద్దతు ఇచ్చినా కాంగ్రెస్ లో రెబెల్స్ కారణంగా అధికారం కోల్పోయారు.

కల్యాణ కర్ణాటకకు వరాలు



- పదేళ్ల తర్వాత కలబురగిలో కేబినెట్ భేటీ
- 56 విభాగాలకు రూ.12,692 కోట్లు : సీఎం



కేబినెట్ భేటీలో సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక జిల్లాలకు సీఎం సిద్ధరామయ్య వరాలు కురిపించారు. కలబురగిలో మంగళవారం ఏర్పాటు చేసిన కేబినెట్ సమావేశంలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. 56 విభాగాలకు రూ.12,692 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. కలబురగిలో కేబినెట్ భేటీ తర్వాత సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రులతో కలసి మీడియాకు వివరాలు తెలిపారు. బీదర్, రాయచూరు పట్టణాలను నగర పాలికెలుగా మార్చనున్నట్లు ప్రకటించారు. బీదర్, కలబురగి జిల్లాల్లో శాశ్వతంగా తాగునీటి కోసం రూ.7,200 కోట్లతో పథకం అమలు చేస్తామన్నారు. ఈ మొత్తంలో కేంద్రప్రభుత్వం 50శాతం భరించేలా విన్నవిస్తామన్నారు. అన్ని గ్రామాలకు శుద్ధమైన తాగునీరు అందించాలని నిర్ణయించామన్నారు. ఆర్టికల్ 371జేను ప్రకటించి పదేళ్లు అవుతోందన్నారు. కేంద్రప్రభుత్వం కనీసం పైసా కూడా ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 5వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. ఈ ప్రాంతంలో ఖాళీగా ఉండే 17,439 పోస్టులను విడతలవారీగా భర్తీ చేయదలిచామన్నారు. 11,770 కోట్ల రూపాయల కేటాయింపులు ప్రకటించారు. అందులో ప్రధానంగా వ్యవసాయానికి రూ.వంద కోట్లు, పారిశ్రామిక అభివృద్ధికి రూ. 1550 కోట్లు, అటవీశాఖకు రూ.32 కోట్లు, వైద్య ఆరోగ్యశాఖ కు రూ.910 కోట్లతో కలిపి అన్నిశాఖలకు గ్రాంట్లు కేటాయించదలిచామన్నారు. మినీ విధానసౌధలను ప్రజాసౌధగా నామకరణం చేయాలని తీర్మానించామన్నారు. నంజుండప్ప అధ్యక్షతన సమర్పించిన నివేదికలో వెనుకబడిన 119 తాలూకాలకు ఇప్పటివరకు ఏ విధమైన ప్రగతి సాధ్యమైందో అంచనా వేసేందుకు ఆర్థిక నిపుణుడు గోవిందరావ్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా కోరామన్నారు. కొత్తగా 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 31 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 9 తాలూకాల ఆసుపత్రులను ఉన్నతీకరించదలిచామని ఇందుకోసం రూ.892 కోట్లు కేటాయించదలిచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అవసరమైన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు సమకూర్చేందుకు తీర్మానించామన్నారు. వైద్యవిద్యారంగానికి సంబంధించి కొప్పళ, గదగ్, చామరాజనగరలలో 450 పడకల సామర్థ్యంతో ఆసుపత్రులకు అవసరమైన వైద్య ఉపకరణాలకు రూ.149.03 కోట్లు కేటాయించామన్నారు. మెడికల్ కళాశాలలు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఎంఆర్‌ఐ యంత్రాల కొనుగోళ్లకు 85.60 కోట్లు కేటాయించదలిచామన్నారు. కలబురగి జిల్లా చిత్తాపుర తాలూకాలో చెరువులకు నీరు మళ్ళించేందుకు రూ.135 కోట్లు కేటాయించామన్నారు. జీవర్గి తాలూకా హరవాళ గ్రామంలో భీమా నదికి అడ్డంగా బ్రిడ్జి నిర్మాణాలకు రూ.130 కోట్లు కేటాయించామన్నారు. రాయచూరు జిల్లా మాన్వి తాలూకా కురిడికెరెకు నీరు మళ్లించేందుకు రూ.132 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో వక్ఫ్‌మండలి బ్యాంకు ఖాతాల్లో లభించే వడ్డీని 15 మహిళా డిగ్రీ కళాశాలలు, పీయూ కళాశాలల్లో భవనాల నిర్మాణాలకు రూ.447.76 కోట్లు కేటాయించదలిచామన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ విశ్వవిద్యాలయం అనుమతులపై చర్చించామన్నారు. కలబురగి యూనివర్సిటీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి తొలి విడతగా రూ.53.25 కోట్లు కేటాయించారు. కొప్పళ, గదగ్ జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఆరంభించదలిచారు. రాష్ట్రవ్యాప్తంగా 43 కార్మిక అధికారుల పరిధిలో స్థిర, సంచార, కార్మిక సేవా కేంద్రాలను డాక్టర్ అంబేడ్కర్ పేరిట రూ.48.08 కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. మొత్తానికి కల్యాణ కర్ణాటక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడినట్లు తెలుస్తోంది.

మా నేతను కలిసేందుకు అనుమతి తీసుకోవాలా..?



- అమెరికాలో రాహుల్ గాంధీతో భేటీపై విమర్శలకు డీసీఎం డీకే కౌంటర్

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కలవడంలో తప్పేమీ లేదని, తాను ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని డీసీఎం డీకే శివకుమార్ ప్రశ్నించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ఆయన మంగళవారం సదాశివనగర్‌లోని నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలో వచ్చిన విమర్శలపై ఆయన ఫైర్ అయ్యారు. రాహుల్‌గాంధీ తమ నాయకుడన్నారు. తమ పార్టీ ప్రముఖులను కలిసేందుకు అనుమతి తీసుకోవాలా అంటూ ప్రశ్నించారు. రాహుల్‌తో ఏం మాట్లాడానని మీడియాతో పంచుకోవడం సాధ్యమా..? అన్నారు. ఇదో మర్యాదపూర్వక భేటీ అన్నారు. పలు అంశాలపై చర్చించుకున్నామని, అభివృద్ధికి సంబంధించి చర్చ జరిగిందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఒక్కలిగ కులస్తుల పట్ల అవమానం కలిగించేలా మాట్లాడడంపై సమాజానికి చెందిన స్వామీజీలు, సీనియర్ నాయకులు, కులపెద్దలు స్పందించాలన్నారు. ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ నాయకులు స్పందించాలన్నారు. దళితులు, ఒక్కలిగల పట్ల మునిరత్న మాట్లాడింది సమంజసమో కాదా అనేది..? తేలాలన్నారు. అరెస్టుకు ముందు అన్నదమ్ముల ఆట ప్రారంభమయిందన్న మునిరత్న వ్యాఖ్యలపై తనకు ఆ విషయమే తెలియదని దాటవేశారు. నాగమంగల గొడవలపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గాడిద పాల కేంద్రం సీజ్

- అనుమతులు లేకుండా వ్యాపారం చట్ట విరుద్ధం : హొసపేట నగరసభ కమిషనర్ చంద్రప్ప

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 17: రైతులకు గాడిదలు సరఫరా చేసి వాటి నుంచి సేకరించిన పాలను విక్రయించడానికి ఏర్పాటు చేసిన 'జెన్ని మిల్క్' స్టార్ట్ అప్ కంపెనీని మంగళవారం అధికారులు సీజ్ చేశారు. విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేటలో ఏర్పాటయిన ఈ కేంద్రాన్ని నగరసభ కమిషనర్ చంద్రప్ప, నగరాభివృద్ధి యోజనా డైరెక్టర్ మనోహర్, పరిశీలించారు. ఈ వ్యాపారానికి అనుమతులు లేవని, అప్పటి వరకు కేంద్రాన్ని తెరవరాదని సూచించారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ చంద్రప్ప మీడియాతో మాట్లాడుతూ ఈ కంపెనీ స్థానికంగా వ్యాపారం చేయడానికి అవసరమైన అనుమతులు పొందలేదని తెలిపారు. గాడిద పాలు సామాజికంగా ఉపయోగించే పాలు కాదని, అందుచేత సంబంధిత అధికారుల నుండి అవసరమైన అనుమతులు పొందిన తరువాతనే నగరసభ అనుమతి ఇస్తుందని వివరించారు. అప్పటి వరకు కార్యాలయంలో ఎలాంటి వ్యవహారాలు జరపరాదని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. గాడిద పాలు పుష్టిదాయకం, శక్తిదాయకం చెప్పుకోవచ్చునని, అయితే అందుకు సరైన ఆధారాలు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. కంపెనీ వలన మోసపోయినట్లు ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినా... ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అందిన సమాచారం ప్రకారం జెర్సీమిల్క్ కంపెనీ రాష్ట్రంలో 200కి పైగా రైతులకు 600కు పైగా గాడిదలను అందజేసినట్లు తెలుస్తోందన్నారు. కంపెనీ ప్రధాన కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం నగరంలో ఉన్నట్లు, అక్కడ గాడిద పాలశుద్ధీకరణ కేంద్రం స్థాపించినట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం హొసపేట నగరంలో ఏర్పాటు చేసిన వ్యాపారకేంద్రాన్ని మూసివేసినట్లు అధికారులు పేర్కొన్నారు.




జెన్నీ పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

ఆర్టికల్ 371 జే తోనే కల్యాణ కర్ణాటక ప్రగతి: సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కల్యాణ కర్ణాటక జిల్లాలకు ఆర్టికల్ 371 జేతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. కల్యాణ కర్ణాటక దినోత్సవంతో పాటు ఆర్టికల్ 371 జే దశమానోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలబురగి నగరం పరేడ్ మైదానంలో సీఎం జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసులనుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. పరేడ్‌లో ఓపెన్‌టాప్ జీప్‌లో సంచరించి వివిధ ప్లటూన్‌లనుంచి గౌరవం పొందారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక జిల్లాల్లో అభివృద్ధికి కట్టుబడ్డామన్నారు. ఆర్టికల్ 371 జే దశమానోత్సవం జరుపుకొంటున్నామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే కల్యాణ కర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది 5వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీయూ, డిగ్రీ విద్యార్థులకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్లను రూ.180 కోట్లతో ఏర్పాటు చేస్తామన్నారు. లక్ష ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కలబురగి తాలూకా నదిసిన్నూరు-హొన్నకిరణ వద్ద వెయ్యి ఎకరాలలో మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను స్థాపిస్తామన్నారు. ఈ ప్రాంతంలో కల్యాణపథ పేరిట వెయ్యి కోట్ల రూపాయలతో 1150 కిలోమీటర్లను అభివృద్ధి చేయదలిచామన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో మంచివర్షాలు కురవడంతో, రైతులు సంతోషంలో ఉన్నాయన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ నిజాంల పాలనలో ఉన్న బీదర్, కలబురగి, రాయచూరు జిల్లాలకు ఏడాది తర్వాత విముక్తి లభించిందన్నారు. వెనుకబడినవర్గాలు, మైనారిటీలు బలిదానం చేశారని, సర్దార్ వల్లభాయ్‌పటేల్ సంకల్ప శక్తి, నెహ్రూ దూరదృష్టితో విముక్తి లభించిందన్నారు. కన్నడ భాష, సాహిత్యం, సంస్కృతికి ఈ ప్రాంతం నిదర్శనమన్నారు. సామాజికచైతన్యం కోరిన బసవణ్ణ, కల్యాణ చాళుక్యుల కాలం నుంచి విశిష్టమైనదన్నారు. దేశంలో లింగ అసమానత తొలగాల్సి ఉందన్నారు. బుద్ధుడు, బసవణ్ణ, అంబేడ్కర్ ఆదర్శాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. ఐదు గ్యారెంటీలతో సామాన్యవర్గాలకు అండగా నిలిచామన్నారు. మహిళా స్వావలంబనకు కట్టుబడ్డామన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే పదేళ్లక్రితం ఆర్టికల్ 371జేను తీసుకొచ్చామన్నారు. విద్యాసంస్థలను అభివృద్ధి చేసేందుకు కట్టుబడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ప్రియాంక ఖర్గే, మునియప్ప, కేజే జార్జ్, భైరతి సురేశ్, హెచ్‌కే పాటిల్, మహదేవప్ప, కేకేఆర్‌డిబి చైర్మన్ అజయ్‌సింగ్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



జాతీయ నాయకుల చిత్రపటాలకు సీఎం పుష్పాంజలి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,621.24
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,236	1739
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,696	9,365
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	64.87

విశ్వకర్మ హాస్టల్‌కు నిధులివ్వాలి



విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 17: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విద్యార్థి వసతి గృహానికి మరిన్ని నిధులు విడుదల చేయాలని జిల్లా విశ్వకర్మ వికాస్ ఫోరం ఎంపీ తుకారాంకు విజ్ఞప్తి చేసింది. నగరంలో మంగళవారం జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి విచ్చేసిన పార్లమెంట్ సభ్యులతో వికాస వేదిక అధ్యక్షుడు చంద్రకాంత్ సోనార్ మాట్లాడారు. విద్యార్థుల హాస్టళ్లకు మరిన్ని నిధులు విడుదల చేయాలన్నారు. విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఎక్కువ గ్రాంట్ ఇవ్వాలని, వడ్రంగి, కమ్మరి, మెటల్ వర్కర్, బంగారు, వెండి వంటి వ్యాపారులలో పేద విద్యార్థులకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు.

సమాజంలో ప్రధాన గుర్తింపు వారికే..



కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు17: విశ్వకర్మ సమాజం వారికి ఎంతో గుర్తింపు వుందని ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ తెలిపారు. మంగళవారం జయంతి సందర్భంగా కాళికా తమటేశ్వర దేవస్థానం వద్ద ఎమ్మెల్యే శిల్ప కళాకారుడు పవన్ కుమార్‌ను, మున్సిపల్ నామినేటెడ్ సభ్యులుమౌనేష్‌ను సన్మానించారు. అంతకుముందు విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సాలాహేశ్వంద్రయ్య మహాస్వాములు, ఆనెగంది సరస్వతీ పీఠాధిపతులు సమాజం అధ్యక్షులు రుద్రప్ప ఆచారి, తహసీల్దార్ శివరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ భావ చిత్రపటంతో ఊరేగింపు

సిరుగుప్ప, సెప్టెంబరు 17 : సిరుగుప్ప తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో విశ్వకర్మ భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తమటేశ్వరాలయం నుంచి ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. నగర సభ అధ్యక్షురాలు రేణుకమ్మ, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, నగరసభ కమీషనర్ గురుప్రసాద్, కాంగ్రెస్ నాయకులు సతీష్, పాల్గొన్నారు.

వంతెనను విస్తరించాలి




వినతి పత్రం సమర్పిస్తున్న యువజన యాక్షన్‌క్లబ్ సభ్యులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 17: నగరంలోని శ్రీ కనక దుర్గమ్మ దేవాలయం సమీపంలోని అంతర్గత వంతెన విస్తరణ పనులను వీలైనంత పూర్తిచేసేలా రైల్వే అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని యువసేన సోషియల్ ఆక్షన్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి జిల్లాకలెక్టర్‌ను కోరారు. గత జిల్లాకలెక్టర్ ఆదేశానుసారం, అప్పటి సిటీ ఎమ్మెల్యే , ఇన్‌ఛార్జిమంత్రి, నేతృత్వంలో బీజేపీ నాయకులు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.8,84,12,616 డీ.డీ.రైల్వే శాఖకు అప్పగించారన్నారు. కానీ నగరంలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలోని అంతర్గత వంతెనను వెడల్పు చేసేందుకు బ్రిడ్జికి ఎటువైపు పనులు చేపట్టాలనే విషయమై అప్పటి జిల్లా కమిషనర్లు రైల్వే అధికారులకు ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దీంతో విస్తరణ పనులను ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారన్నారు.


అహో.. నాటి వైభవం..

- ఆశ్చర్యం కలిగిస్తున్న శతాబ్దాల నాటి భవనాలు
- అప్పట్లో బళ్లారి కేంద్రంగా 33 జిల్లాల పాలన



1842లో నిర్మించిన డీసీ బంగ్లా

బళ్లారి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆహా.. ఈ బిల్డింగ్ చూడు ఎంత చూడచక్కగా ఉందో! ఈ కిటికీలు, ఈ వాకిళ్లు, పై అంతస్తుకు వేసిన కాంక్రీటు ఎంత బాగున్నాయో కదా.! ఇవి ఏ పదేళ్లో, పాతికేళ్ల క్రితమో కట్టిన భవనాలు కాదు, ఏకంగా శతాబ్దల కాలం క్రితం కట్టిన భవనాలు. అయినా ఇప్పటికీ భవనాల రూపురేఖల్లో మార్పులేదు. వేసవిలో చల్లగా, శీతల కాలంలో వెచ్చగా ఉంటాయి. వాస్తవానికి ఈ కార్యాలయాల్లో ఇప్పటికీ వేసవిలో కూడా గాలి కోసం ఫ్యాన్లు, ఏసీలు అమర్చుకోరు. ఈ పురాతన కట్టడాలను అందుకే గొప్పవిగా ఇప్పటి కాలం వారు భావిస్తున్నారు. 1845 కాలంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, అలాగే డీసీ బంగ్లా, వీటితో పాటు ఎస్పీ బంగ్లా, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బంగ్లా, లండన్ మిషన్ ఎడ్యుకేషన్ సెంటర్, బ్రూస్‌పేట్ పోలీస్‌స్టేషన్, 1872లో రైల్వే స్టేషన్, జడ్జి బంగ్లా, హెడ్ పోస్టాఫీస్, రిజిస్ట్రార్ ఆఫీస్, జిల్లా జైలు, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్, ఇలా అనేక బంగ్లాలను నిర్మించారు. ఈ కట్టడాల విశిష్టత కూడా ప్రత్యేకంగా ఉంటుంది. 1845 కాలంలో అప్పటి బ్రిటీష్ పరిపాలనకు బళ్లారి కేంద్రంగా ఉండేది. 33 జిల్లాలకు ఇక్కడి నుంచే పరిపాలన సాగించారు. బ్రిటీష్ పాలకులు అప్పుడు ఇక్కడ ప్రతి కార్యాలయానికి భవనాలను నిర్మించారు. ఇప్పటికీ ఈ భవనాలు ఎంతో సుందరంగా చెక్కుచెదరకుండా ఉండడం విశేషం.



బంగ్లా నుంచి ట్రెజరీ వరకూ వెళ్లేందుకు మార్గం

నిజాం అకృత్యాలతోనే వెనుకబాటు



ప్రగతి పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు



మాట్లాడుతున్న మంత్రి రహీం

- సర్దార్ పటేల్‌కు జనం నివాళులు
- కల్యాణ కర్ణాటకకు ప్రాణం పోసిన ఆర్టికల్ 371(జే)
- విమోచన దినోత్సవ వేడుకల్లో మంత్రి రహీం

బళ్లారి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిజాముల అకృత్య పరిపాలన కారణంగా అప్పటి హైద్రాబాద్ కర్ణాటక జిల్లాలు వెనుకబడ్డాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ, హజ్ శాఖ మంత్రి రహీం అన్నారు. 371 (జే) ఆర్టికల్ ఈప్రాంత అభివృదికి ఎంతో దోహదపడుతోందన్నారు. కల్యాణ కర్ణాటక దినోత్సవాన్ని బళ్లారి మున్సిపల్ మైదానంలో మంగళవారం అధికారికంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మున్సిపల్ శాఖ, హజ్ శాఖ మంత్రి రహీం మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబురగి, బళ్లారి, విజయనగర, బీదర్ జిల్లాలు నిజాం మీర్ ఉస్మాన్ అలీ పాలనలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కల్యాణకర్ణాటకగా ప్రకటించడంతో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో 371(జే) ఆర్టికల్ విడుదల చేసి నిజాముల కాలం నుంచి అణగదొక్కబడిన ప్రజలకు న్యాయం చేసిందన్నారు. ఇప్పటికీ 114 తాలూకాలు వెనుకబడినట్లు గుర్తించారని పేర్కొన్నారు.

ఎంపీ తుకారాం మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక ప్రాంతం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమని ఇక్కడ నిజాం పరిపాలన కారణంగా ప్రజలు పీడనకు



శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో వేడుకలు

లోనవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముండ్రిరిగి నాగరాజు, మహానగర పాలికే మేయర్ ముల్లంగి నందీష్ బాబు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కర్ణాటక పోరాట కమిటీ అధ్యక్షుడు సిరిగేరి పన్నారాజ్ మాట్లాడుతూ, సర్దార్ వల్లబాయ్ పటేల్ నిజాముల దుష్టపరిపాలన నుండి ప్రజలకు మోక్షం కల్పించాడన్నారు. ఈ సందర్భంగా నగర పాలికే ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పౌర కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

ఆసరే పుస్తక ఆవిష్కరణ

ఈ సందర్భంగా విద్యాశాఖ 'కలికా ఆసరే ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. వీటిని మంత్రి, ఇతర అధికారుల చేతుల మీదుగా కల్యాణ కర్ణాటక దినోత్సవ వేదికపై ఆవిష్కరించారు. అలాగే కల్యాణ కర్ణాటక 371(జే) అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు అందించారు.

రాఘవ కళామందిర్ సర్కిల్లో

నగరంలోని రాఘవ కళామందిర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన కల్యాణ కర్ణాటక ఉత్సవాలను ఉపాధ్యాయుడు బసవరాజు జాతీయ జెండాను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆ రోజుల్లో కన్నడ పాఠశాలల ముందు ఉర్దూ పాఠశాల అనే బోర్డును అతికించేవారన్నారు. రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవా మాట్లాడుతూ నిజాంను గద్దె దింపడంలో అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చాతుర్యాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కళ్యాణ కర్ణాటక వికాస్ అకాడమీ అడవిస్వామి, నగర కన్వీనర్ వెంకటేశ్ బడిగెర, కల్లుకంభ, శివేశ్వరగౌడ్, సిద్దలింగయ్య, బసవరాజు, యల్లనగౌడ, తిప్పేస్వామి, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో..

వేలాది మంది యోధుల త్యాగాలతో హైదరాబాద్ కర్ణాటక విముక్తి పోరాటం చరిత్రగా నిలిచిపోయిందని ప్రొఫెసర్ శాంతనాయక్ అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరీక్షా హాల్ ముందు ప్రముఖులు జెండాను ఎగురవేసి కల్యాణ కర్ణాటక ఉత్సవాన్ని జరుపుకున్నారు. నగరంలోని ప్రాథమిక పాఠశాలల్లో కల్యాణ కర్ణాటక ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నిష్టిరుద్రప్ప, పాఠశాల అధ్యక్షులు మంజునాథ్, రాజశేఖర్, అరుణ్‌కుమార్, ప్రకాశ్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయచూరులో పటేల్ విగ్రహానికి నాయకుల నివాళులు

రాయచూరు సెప్టెంబర్ 17 : కల్యాణ-కర్ణాటక ప్రాంత విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహానికి నాయకులు ఘన నివాళులర్పించారు. మహాత్మగాంధి స్టేడియంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటీల్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ వరణ ప్రకాశ్ పాటీల్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఏడాదిన్నర అనంతరం స్వేచ్ఛవాయులు పీల్చిన కల్యాణ కర్ణాటక ప్రాంతం సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. కల్యాణ కర్ణాటక విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్ర జెండాను ఎగరవేశారు.



పటేల్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి శరణ ప్రకాశ్

ఏళుపడగల నాగప్ప హుండీ లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కంప్లి, సెప్టెంబరు 17 : తాలుకా పరిధిలోని బుక్కసాగర వద్ద వుండే ఏళపడగల నాగప్ప దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ హుండీ లెక్కింపులో రూ.3,48,330లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారి హనుమంతప్ప మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తాగునీటి సౌకర్యం, విశ్రాంత గదులు, భోజనాలు, అన్నప్రసాదాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చేతన్‌కుమార్, నాగప్ప, ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ అభియాన్



స్వచ్ఛభారత్ అభియాన్‌లో రైతు మోర్చా నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా జిల్లారైతుమోర్చా ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బీఐ కాలనీ ఉద్యానవనంలో మంగళవారం స్వచ్ఛభారత్ అభియాన్‌ను నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురులింగనగౌడ మాట్లాడుతూ, నరేంద్రమోదీ దేశానికి దృఢమైన నాయకుడని, నిజాయితీపరుడని కొనియాడారు. ఈసందర్భంగా బీజేపీ రైతుమోర్చా ఉపాధ్యక్షుడు గాలిశంకరప్ప, గణపాల ఐనాథ్‌రెడ్డి, హులుగప్ప, శరణబసవగౌడ, హొన్నారెడ్డి, హనుమంతప్ప, వెంకటేశ్వరరెడ్డి, నాగవేణి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌పటేల్, పాండు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులకు తగ్గ వేతనాలు ఇవ్వండి



కనీస వేతనాల కోసం నిరసన చేపట్టిన కార్మికులు

కంప్లి, సెప్టెంబరు 17 : కుడితిని వద్ద కేపీసీఎల్‌లోని బీటీపీఎస్‌లో కాంట్రాక్ట్ కూలీలకు పనులు చేసిన కార్మికులకు పనులకు తగ్గట్టు వేతనాలు ఇవ్వాలంటూ బీటీపీఎస్ గేటు ముందు భాగంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సమితి అధ్యక్షులు సత్తిబాబు, బీటీపీఎస్ కార్మిక సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి కార్మికులకు కనిష్ఠ వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే ఇకపై కాంట్రాక్ట్ కింద ఈఎస్ఐ కార్డు, క్యాష్ హ్యాండ్లింగ్ కార్మికులకు ఇన్సెంటివ్‌లు ఇవ్వాలన్నారు. రక్షణ వేదిక ప్రముఖులు సంపత్ కుమార్, జగదీష్, అంజినప్ప, వీరేష్, శివశంకర్, శరణుస్వామి, రుద్రమ్మ, మల్లమ్మ, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

హోసూరు జోన్

వన్నియార్‌లకు 20శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



పాతాళి మక్కళ్ పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన

హోసూరు సెప్టెంబరు 17: విద్యా, ఉద్యోగ రంగాలలో వన్నియార్లకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వన్నియార్ సంఘం డిమాండ్ చేసింది. గతంలో పోరాటంలో 21 మంది ప్రాణాలు అర్పించారని, వారి బలిదానం ఫలితంగా 108 కులాలకు 20శాతం అత్యంత వెనుకబడిన వారిగా ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారని సంఘం పేర్కొంది. అమరవీరుల త్యాగానికి అందుకు గుర్తుగా కృష్ణగిరి జిల్లా వన్నియార్ తరపున జిల్లా అధ్యక్షుడు అరుళ్ ఆధ్వర్యంలో హోసూరులో అమరవీరుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. బస్‌స్టేషన్ దగ్గర వన్నియార్ సంఘం కార్యవర్గ సభ్యులు, పాటాలి మక్కళ్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి అరుళ్‌రాజ్, హోసూరు మున్సిపల్ కార్యదర్శి గుణశేఖరన్ తదితరులు కొవ్వొత్తి వెలిగించి అక్కడ ఉంచిన అమరవీరుల చిత్రపటాలకు మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించి నివాళులర్పించారు. వాటిల్లో వన్నియర్ సంఘం , పాతాళి మక్కళ్ పార్టీ తరపున పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ నేత తీరుపై నిరసన

హోసూరు, సెప్టెంబరు 17: హోసూరు గాంధీ విగ్రహం వద్ద పశ్చిమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురళీధరన్ ఆధ్వర్యంలో తమిళనాడు బీజేపీ తాత్కాలిక ఇన్‌చార్జ్ హెచ్.రాజు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఒక ప్రైవేట్ టీవీ ఛానెల్‌లో ఆయనలా వేషధారణ చేయడాన్ని ఖండించారు. అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అతనిని అరెస్ట్ చేయాలని కోరారు. ఇందులో మున్సిపల్ అధ్యక్షుడు త్యాగరాజన్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కీర్తిగణేశ్, మున్సిపల్ కార్యదర్శి ఇర్షాద్, ముఖ్య నిర్వాహకులుగా పాల్గొన్నారు.


గోడను ఢీకొన్న మినీ లారీ

హోసూరు(క్రైం), సెప్టెంబరు 17: హోసూరు పెరియార్ నగర్ రింగ్ రోడ్డులో వెళ్తున్న మినిలారీ ఇంటిగోడను ఢీ కొన్న ప్రమాదంలో సిమెంట్ షీట్ కూలి ఒకరికి గాయాలయ్యాయి. ఇతరులు ప్రాణాలతో బయటపడ్డారు. నారాయణన్, భార్య వినోధ, కుమారుడు గోపి, కుమార్తె విద్య వారి పసిపాపతో ఆ ఇంట్లో నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం అందరూ ఇంట్లో ఉండగా ఆ సమయంలో అటుగా వచ్చిన మిని లారీ అదుపు తప్పి ఒక్కసారిగా నారాయణన్ ఇంటి గోడను ఢీకొంది. దీంతో సీలింగ్‌కు వేసిన సిమెంట్ షీట్ కూలిపోయి క్రింద పడింది, ఇంట్లో నిద్రిస్తున్న గోపికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే ఇంట్లో ఉన్న చిన్నారి సహా ముగ్గురు వ్యక్తులు అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడ్డారు, ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది, నగర పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.



ఇంటిగోడను ఢీ కొన్న మినీ లారీ

వైద్య విద్యార్థినుల రక్షణకు పటిష్ట చర్యలు: మంత్రి



మాట్లాడుతున్న వైద్య విద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

రాయచూరు, సెప్టెంబరు 17: ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివే విద్యార్థినుల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్య విద్య శాఖ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ అన్నారు. కల్యాణ కర్ణాటక విమోచన దినోత్సవంలో పాల్గొనేందుకు మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రి కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కల్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధుల బోర్డును రద్దు చేయాలన్న నిర్ణయానికి సంబంధించి తనదగ్గర సమాచారం లేదన్నారు. అదే సమయంలో మంత్రి వర్గంలో ఈ ప్రాంతం అభివృద్ధికి తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్, లింగసుగూర్ తాలూకాలోని సన్నకల్ గ్రామంలో అక్రమ భూములు కలిగి ఉన్నారన్న విషయం గురించి తమకు తెలియదన్నారు. ఈ విషయంలో జిల్లాధికారి విచారణ జరిపి ప్రభుత్వానికి తగిన నివేదిక ఇస్తారన్నారు. సమస్యల పరిష్కారం కోసం మంత్రి వర్గ సమావేశంలో చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సిరుగుప్పలో ఘనంగా గణేశ్ శోభాయాత్ర



గణేశుడి శోభాయాత్ర

సిరుగుప్ప, సెప్టెంబరు 17 : అంగరంగ వైభవంగా సిరుగుప్పలో మంగళవారం గణేశ్ శోభాయాత్ర జరిగింది. సిరుగుప్ప పట్టణం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపించిన వినాయకుడి విసర్జన ఎంతో వైభవంగా జరిగింది. ఉదయం పూజలు జరిపి ప్రారంభించిన శోభాయాత్ర సందర్భంగా వివిధ నృత్య ప్రదర్శనలు, డ్యాన్స్‌లు, వివిధ వేషధారణలతో ఊరేగింపు కొనసాగింది. కార్యకర్తలు, విశ్వహిందూపరిషత్ పదాధికారులు, సభ్యులు వేలాది మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. ఎక్కడ చూసినా అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎస్పీ శోభారాణి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విష్ణువర్ధన్ (జయంతి)



కన్నడ సినీరంగంలో 'సాహస సింహ' గా పేరొందిన డాక్టర్ విష్ణు వర్ధన్ 1950 సెప్టెంబరు 18న మైసూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సంపత్‌కుమార్. దర్శకుడు పుట్టణ్ణ కణగాల్ రూపొందించిన 'నాగరహావు' సినిమాలో విష్ణువర్ధన్‌గా పరిచయమయ్యారు. కన్నడ, హిందీ, తెలుగు, తమిళ, మళయాళ భాషల్లో 220కుపైగా సినిమాలలో నటించారు. కొన్ని సినిమాలతోపాటు భక్తి ఆల్బమ్స్‌కు పాటలు పాడారు. తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలతో 'అభినవ భార్గవ'గా పేరొందారు. ఏడుసార్లు ఉత్తమ నటుడి అవార్డు, రాజ్యోత్సవ, జీవితసాఫల్యతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. బెంగళూరు యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. బెంగళూరులోని బనశంకరి దేవాలయం నుంచి కెంగేరి వరకు 14.3 కిలోమీటర్ల పొడవైన రోడ్డుకు గౌరవార్థం ఆయన పేరు పెట్టారు. 2009 డిసెంబరు 30న కన్నుమూశారు.

షబనా అజ్మీ (పుట్టినరోజు)



బాలీవుడ్ సినీనటి, 'పద్మభూషణ్' గ్రహీత షబనా అజ్మీ 1950 సెప్టెంబరు 18న హైదరాబాద్‌లో జన్మించారు. బుల్లితెరపైనా రాణించారు. సినీరంగంలో ఉత్తమ నటిగా ఐదు జాతీయ పురస్కారాలు, ఫిల్మ్ ఫేర్ అవార్డులు అందుకున్నారు. సామాజిక కార్యకర్తగా, మహిళా హక్కులనేతగాను గుర్తింపు పొందారు. రచయితగా, స్క్రీన్‌రైటర్‌గా రాణించారు. ఆమె సేవలకుగాను రాష్ట్రపతిచే రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ చేయబడ్డారు. పద్మశ్రీ, గాంధీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డు, మార్టిన్ లూథర్‌కింగ్ ప్రొఫెసర్‌షిప్ అవార్డు, పలు యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

ఉపేంద్ర (పుట్టినరోజు)



కన్నడ సినీ నటుడు ఉపేంద్ర 1968 సెప్టెంబరు 18న ఉడుపి జిల్లా కుందాపురలో జన్మించారు. కాశీనాథ్ దర్శకత్వంలో రచయితగా సినీరంగంలోకి అడుగుపెట్టారు. దర్శకుడు, నిర్మాత, స్క్రీన్ రైటర్‌గాను సత్తా చాటుకున్నారు. కన్నడ, తెలుగు, తమిళ సినిమా లలో నటించారు. విభిన్న సినిమాలు రూపొందించి నటించడం ద్వారా బాక్సాఫీస్ బ్రహ్మగా పేరొందారు. 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని స్థాపించి రాజకీయాలలోకి వచ్చారు. అభిమానులచే సూపర్‌స్టార్, రియల్ స్టార్, 'ఉప్పి' గా పిలబడుతున్నారు. నటి ప్రియాంకను పెళ్లి చేసుకున్నారు.

21నుంచి బీ-షిప్ ఫ్యామిలీ ఎక్స్‌పో

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య బిజినెస్ గ్రూప్ బెంగళూరు బీ-షిప్ ఫ్యామిలి ఎక్స్‌పో ఈనెల 21నుంచి రెండు రోజులపాటు జరగనుందని నిర్వాహకులు తెలిపారు. జెపినగర్ 7వ ఫేజ్, బ్రిగేడ్ మిలీనియం సమీపంలోని శుభ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ప్రదర్శనలో ఆహారం, బట్టలు, ఆఫీస్ మెటీరియల్, జీవనశైలి, గృహోపలంకరణ, మేకప్, ఆరోగ్యం, ఎలక్ట్రానిక్స్ ఆభరణాలతోపాటు ఇతరత్రా వస్తువుల ప్రదర్శన ఉంటుందన్నారు. 200కుపైగా స్టాల్స్‌తోపాటు వర్క్‌షాప్‌లు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటా యన్నారు. వాసవి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆరంభిస్తారని, కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీ తేజస్వీ సూర్య, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డిలు పాల్గొంటారు. ఆర్యవైశ్య బిజినెస్ గ్రూప్ ఛైర్మన్ నాగరాజ్ బైసాని, బీ-షిప్ ఛైర్మన్ శ్రీధర్ తదితరులు పర్యవేక్షించనున్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

పామిడి, సెప్టెంబరు 17: ఆర్ఎంపీ వైద్యం వికటించి పుల్లా ఆదినారాయణ(55) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అనంతపురం జిల్లా పామిడి మండలంలోని ఎద్దులపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... పుల్లా ఆదినారాయణ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఓ ఆర్ఎంపీని ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్ వేయించుకున్నాడు. ఆ సమయంలో భోజనం చేశావా అంటే అవునని అబద్ధం చెప్పినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు. ఇంజక్షన్ వేసిన కొద్ది సమయానికే అపస్మారక స్థితిలోకి వెళ్తుండడంతో గమనించిన ఆర్ఎంపీ, కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి పామిడి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆ కుటుంబాన్ని కలిసి ప్రాథమికంగా విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు సిఫార్సు చేశామన్నారు. ఈ మృతిపై పూర్తిగా విచారించి వివరాలు వెల్లడిస్తామన్నారు. పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పుట్టపర్తి-బెంగుళూరు రైలు అనంత వరకు పొడిగింపు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 : పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు రైల్వే శాఖ మంత్రికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు



తెలిపారు. గత పార్లమెంట్ సమావేశాల్లో జిల్లాకు చెందిన ప్రజల చిరకాల కోరికైన అనంతపురం వరకు పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్‌ను పొడిగించాలని రైల్వే శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

టమోటా కిలో రూ.35

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 3,150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

మోదీ నేతృత్వంలోనే అభివృద్ధి





రక్తదాన శిబిరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, చిత్రకళా అభియానలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ ఇటీవలి వందరోజుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శ్రీకారం చుట్టారన్నారు. మహిళ, యువత స్వావలంబన, ఆరోగ్యసేవల రంగాలలో కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని పార్టీ కార్యకర్తలందరి తరఫున ప్రధాని మోదీకి భగవంతుడు ఉత్తమ ఆయురారోగ్యాలు కల్పించాలని ప్రార్థించారన్నారు. గతంలో యూపీఏ పాలనలో కుంభకోణాల పాలన చూశామని, ప్రస్తుతం ఎన్డీయే పాలనలో అభివృద్ధి చూస్తున్నామన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి, రోడ్ల అనుసంధానం, బెంగళూరు మెట్రో, రైలు మార్గాల అభివృద్ధి వంటివాటికి ప్రధాని మోదీ గరిష్ఠంగా సహకారం అందించారన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని 70ఏళ్లకుపైబడినవారికి కూడా విస్తరించారన్నారు. 6కోట్లమందికిపైగా సీనియర్ సిటిజన్లకు ప్రయోజనం కానుందన్నారు. మూడోసారి ప్రధాని అయ్యాక మోదీ మరింత ప్రభావ నాయకుడిగా నిలిచారన్నారు. బీజేపీ కార్యాలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యాలయంలో నరేంద్రమోదీ చిత్ర కళా శిబిరం, రంగోలి ప్రదర్శనను కేంద్రమంత్రి శోభాకరంద్లాజె లాంఛనంగా ప్రారంభించారు. ప్రతిపక్షనేత అశోక్, ఎమ్మెల్సీ సిటి రవి, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు హరీశ్, ఇతర విభాగాల నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు



మహదేవపురలో అన్నదానం

మహదేవపురలో...

మహదేవపుర: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ మంత్రి అరవింద లింబావళి నేతృత్వంలో 120కుపైగా ప్రాంతాలలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగాయి.



రంగవల్లిలో ప్రధాని మోదీ

తొలుత పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం, స్వచ్ఛతా కార్య క్రమాలు, ఆశ్రమాలలో అన్నదాసోహం, మొక్కలు నాటే కార్యక్రమం, గోశాలల్లో మేత అందజేత, పౌరకార్మికులకు దుస్తుల పంపిణీ ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగాయి. బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు అధ్యక్షుడు మనోహరరెడ్డి, నటరాజ్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట, సెప్టెంబరు 17: ఇంటింటా సభ్యత్వ నమోదు చేపట్టడంతో పాటు ప్రధాని మోదీ ప్రజాపాలనను దేశంతోపాటు ప్రపంచమంతా చూస్తోందని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కొత్తనూరు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రగౌడ మాట్లాడుతూ పార్టీలో సామాన్య కార్యకర్తకు తగిన హోదా, స్థాయి లభిస్తుందన్నారు. ఇదే సందర్భంగా సభ్యత్వ నమోదు చేసుకున్నవారికి గుర్తింపుకార్డులు ఇచ్చారు. ఎమ్మెల్సీ, సభ్యత్వ నమోదు అభియాన బెంగళూరు గ్రామీణ ఇన్‌చార్జ్ కేశవప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా కార్యక్రమాలు సాగాయి.

కెనరాబ్యాంకుకు రాజభాషా కృతి పురస్కారం

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ కెనరాబ్యాంకుకు రాజభాషా కృతి పురస్కారం లభించింది. హిందీదివస్ ఉత్సవంలో భాగంగా న్యూఢిల్లీలో ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో నాల్గో ఆలిండియా అధికారిక భాషల సదస్సు ప్రగతి మైదాన్‌లో జరిగింది. హోంమంత్రిత్వశాఖ మంత్రి నిత్యానందరై, బండి సంజయ్‌కుమార్‌లనుంచి కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ కె సత్యనారాయణ రాజు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ మాట్లాడుతూ పురస్కారం దక్కడంతో బ్యాంకుపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రతిరోజూ వాడకంలో హిందీ ప్రాధాన్యత గురించి ఖాతాదారులకు చేరువ చేయనున్నట్లు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న కెనరా బ్యాంకు ఎండీ సీఈఓ సత్యనారాయణ రాజు

ఘనంగా విశ్వకర్మ జయంతి



శిడ్లఘట్ట తాలూకా కార్యాలయంలో ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 17: ప్రతి కళలోనూ విశ్వకర్మ సామాజికవర్గ సేవలు ఉన్నాయని ఎమ్మెల్యే రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో మంగళవారం జాతీయ పండుగల సమితి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిలో ఆయన పాల్గొని మాటాడారు. ప్రజలు నిత్యం వినియోగించే ఎన్నో చేతి సామగ్రి, లోహం, ఇనుప, దేవుడి విగ్రహాలు, చిత్రపటాలు, గృహోపయోగ వస్తువులు ఇలా ఎన్నింటినో విశ్వకర్మలు చేస్తున్నారన్నారు. తహసీల్దార్ స్వామి మాట్లాడుతూ పిల్లల విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ప్రోత్సహించాలని విద్యయే గొప్ప ఆస్తి అన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కాగా కాళికాంబ కమటేశ్వర ఆలయంలోనూ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ క్షేమాభివృద్ధి సంఘం తాలూకా అధ్యక్షుడు అమరనారాయణచారి, కాళికాంబ కమటేశ్వర ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మునిరత్నాచారి, సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా పలుచోట్ల విశ్వకర్మ జయంతి నిర్వహించారు. కాగా బాగేపల్లిలోనూ విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.



బాగేపల్లిలో ఊరేగింపు ఇలా...

21న అక్కినేని శతజయంత్యుత్సవాలు

» తెలుగు విజ్ఞాన సమితి ద్వారా సహజనటి జయసుధ, సుమన్‌కు పురస్కారాలు



అక్కినేని శతజయంతి పోస్టర్‌లు విడుదల చేస్తున్న తెలుగువిజ్ఞాన సమితి ముఖ్యులు

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు జరుపుతున్నట్లు అధ్యక్షులు రాధాకృష్ణరాజు తెలిపారు. మంగళవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, పద్మవిభూషణ్, నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవం శనివారం సాయంత్రం వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో జరుపుతామన్నారు. సాయంత్రం కళాకారులు నవీన్ ధనలక్ష్మిల బృందంచే అక్కినేని సినిమా పాటల ఆలాపన ఉంటుందన్నారు. అనంతరం సహజనటి డాక్టర్ జయసుధ, సుప్రసిద్ధ నటులు డాక్టర్ సుమన్ తల్వార్‌లకు అక్కినేని శతజయంతి పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యులుగా రాష్ట్ర డీసీఎం డీకే శివకుమార్, మంత్రి రామలింగారెడ్డి, ఏపీ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. తెలుగు విజ్ఞాన సమిత ట్రస్టు అధ్యక్షులు కే శ్యామరాజు ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు గంగరాజు, ఆదికేశవుల నాయుడు, లక్ష్మీరెడ్డి, కమిటీ సభ్యులు క్రిష్ణయ్యనాయుడులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఐబీఎస్) అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్ అభిప్రాయపడ్డారు. చిక్కబళ్లాపుర జిల్లా వర్లకొండ గ్రామంలో జై ఫౌండేషన్, కెన్నడి బ్లూ కేఫ్, జియట్యాగ్, రి గ్రీన్ ల్యాబల్ భాగస్వామ్యంతో వనమహోత్సవం జరిపారు. గంట వ్యవధిలో 40వేల మొక్కలను విజయవంతంగా నాటామని జయప్రకాశ్ తెలిపారు. కనీసం కోటి మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చెట్లు హరించుకుపోతుండడంతో పర్యావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాలు కురవకపోవడంతోపాటు వాతావరణంలో సమతుల్యత లేకుండా పోతోందన్నారు. నాటిన మొక్కలను జియోట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు అక్షిత్ కెన్నడియా ముఖ్యులుగా పాల్గొన్నారు. వెయ్యిమందికిపైగా విద్యార్థులు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోనూ కేర్ టేకర్‌లను నియమించామని వారు మొక్కలకు నీరుతోపాటు ఎరువులు, సంరక్షణ బాధ్యత చేపడతారన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు తదితరులు

స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభం

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 17: తాలూకాలోని కొడిగేహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ దేవస్థానం వద్ద స్వచ్ఛతా పక్షోత్సవం నిర్వహించారు. ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ కెఎన్ అనురాధ లాంఛనంగా ప్రారంభించారు. తాలూకాలోని గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛత పాటించే అంశంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేలా పక్షోత్సవం ఉంటుందన్నారు. ఉప కార్యదర్శి టికె రమేశ్ మాట్లాడుతూ అక్టోబరు 2వరకు అభియాన ఉంటుందన్నారు. గ్రామాలలో బ్లాక్‌స్పాట్స్‌లలో పేరుకున్న చెత్తా చెదారం తొలగించనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన చిత్రకళా పోటీలు నిర్వహించదలిచామన్నారు. ఈఓ మునిరాజు, తాలూకాస్థాయి అధికారులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా అభియానలో అధికారులు, విద్యార్థులు

మెట్రో ట్రాక్‌పైకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాక్‌పైకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జ్ఞానభారతి మెట్రో స్టేషన్‌లో మధ్యాహ్నం 2.13 గంటలకు రైలు స్టేషన్‌కు సమీపిస్తున్న వేళ బిహార్‌క చెందిన 30ఏళ్ల సిద్దార్థ ఒక్కసారిగా ట్రాక్‌పైకి దూకాడు. వెంటనే ఎమర్జెన్సీ ట్రిప్‌సిస్టమ్‌ను స్టేషన్ కంట్రోలర్ ప్రయోగించారు. దీంతో రైలు ఒక్కసారిగా నిలిపివేశారు. వెంటనే భద్రతా సిబ్బంది అతడిని ట్రాక్‌నుంచి బయటకు తీసుకొచ్చారు. మెట్రోట్రాక్‌పైకి బిహార్ వాసి దూకగానే ఒక్కసారిగా కరెంటును నిలిపివేశారు. మెట్రోట్రాక్‌పై కరెంటు నిలిచిపోవడంతోపాటు మెట్రో రైలు లోకో పైలట్ అప్రమత్తమై నిలిపారు. దీంతో బిహార్‌వాసి ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు. మెట్రో ట్రాక్‌పైనే ఆత్మహత్యకు ప్రయత్నించేందుకు 440 - 720 ఓల్టుల విద్యుత్ ఉంటుంది. ట్రాక్‌పై కొన్ని క్షణాల్లోనే మృతి చెందే అవకాశాలు ఉంటాయి. దీంతో ట్రాక్‌పైకి దూకి ఆత్మహత్య ప్రయత్నాలు చేసి ఉంటాడని భావిస్తున్నారు.



బీహార్ వాసిని రక్షిస్తున్న భద్రతా సిబ్బంది

లివర్ దానం చేసి ప్రాణాలు కోల్పోయిన

విద్యావేత్త అర్చనా కామత్



అర్చనా కామత్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకురాలిగా విద్యావేత్తగా తీరప్రాంత జిల్లాల్లో చిర పరిచితురాలైన అర్చనా కామత్ (34) లివర్ దానం చేసి ప్రాణాలు కోల్పోయిన సంఘటన జరిగింది. భర్త చేతన్ బంధువులలో 69ఏళ్ల మహిళ అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో ఆమెకు లివర్ అవసరం ఏర్పడింది. కుటుంబ సభ్యులందరి రక్తపునమూనాలను సేకరించినా సరిపోలేదు. అర్చనాకు సంబంధించిన లివర్ మ్యాచింగ్ కావడంతో ఆపరేషన్ చేశారు. మూడు రోజుల విశ్రాంతి తర్వాత దక్షిణకన్నడ జిల్లా మంగళూరుకు అనుబంధమైన కరంగాల్పడికి వెనుతిరిగారు. ఆమె ఆరోగ్యంలో సమస్యలు నెలకొనడంతో వెంటనే బెంగళూరుకు తీసుకొస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. ఆమె పుట్టినిల్లు కుందాపురలోని కోటేశ్వరలో సోమవారం అంత్యక్రియలు జరిపారు. మంగళూరు కెనరా కాలేజ్‌లో అధ్యాపకురాలిగా వ్యవహరించారు. మణేశ్ శ్రీనివాస్ నాయక ఎంబీఏ కళాశాలలోనూ అధ్యాపకురాలిగా పనిచేశారు. విద్యావేత్తగా దక్షిణకన్నడ జిల్లాలో చిరపరిచితురాలైన అర్చనా మృతి పట్ల సర్వత్రా విచారం వ్యక్తమైంది. భర్త సీఏ చేతన్‌కుమార్, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. మరొకరికి ఆరోగ్యం చేకూర్చేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోవడం విషాదంలోకి నెట్టేసింది. లెక్చరర్ అర్చనా ఆకస్మిక మృతి పట్ల విద్యార్థులు, ఇతర అధ్యాపకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. లెక్చరర్‌గా విద్యావేత్తగా ఎంతో పేరొంది అవయవదానం చేసి చివరకు బంధువులకు సాయం చేసి ప్రాణాలు కోల్పోవడం పలువురిని కలచివేసింది. సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొని ప్రజల ఆదరణ పొందారు.

విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాలకు దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని కాన్ఫిడెన్స్ గ్రూప్ ఛైర్మన్ ఎండీ నితిన్‌ఖర అభిప్రాయపడ్డారు. కాన్ఫిడెన్స్ గ్రూప్‌కు అనుబంధమైన గో-గ్యాస్ ద్వారా ఎలక్ట్రిక్ గో-బైక్‌లను మంగళవారం లాంఛనంగా విడుదల చేశారు. గో-గ్యాస్ బెంగళూరులో 80 ఎల్‌పిజి, 40 సిఎన్‌జి అవుట్‌లెట్‌లను కలిగి ఉందన్నారు. తొలిసారిగా ఎలక్ట్రికల్ బైక్‌లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామన్నారు. త్వరితగతిన చార్జింగ్, 80-120 కిలోమీటర్ల ప్రయాణించే సామర్థ్యంతో వాహనాలు విడుదల చేశామన్నారు. 2 మోడల్స్ స్కూటర్‌లు, 2 మోటర్‌సైకిళ్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. గో-బైక్ లిథియం అయాన్ బ్యాటరీలు కలిగి ఉందన్నారు. తద్వారా నాణ్యత సాధ్యమన్నారు. రూ.75వేల నుంచి రూ.1.75లక్షల దాకా బైక్‌ల ధర నిర్ణయించామన్నారు. ఇదో లిస్టెడ్ కంపెనీ అని పర్యావరణానికి మేలు కలిగించేలా వాహనాలు రూపొందించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మోడల్స్ తెచ్చే ఆలోచన ఉందన్నారు. మార్కెటింగ్ హెడ్ రిషి అగర్వాల్, టెక్నికల్ హెడ్ వీరేంద్ర తోపాటు పవనీత్ భద్ర తదితరులు పాల్గొన్నారు.